సమాచారం

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హఫీజ్‌పేట్ : హఫీజ్‌పేట్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ ఫీడర్ల పరిధిలో విద్యుత్ మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు ప్రక్రియలో భాగంగా సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ రాజేందర్ పేర్కొన్నారు.

- వైశాలీనగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 09.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.00 గంట వరకు వైశాలీనగర్, ఉషోదయ ఎన్‌క్లేవ్, మంజీరా పైప్‌లైన్ రోడ్డు, ఏపీఎస్‌జీఓ కాలనీ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.
- ఆదిత్య ఇంపీరియల్ హైట్స్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2.00 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ఆదిత్య ఇంపీరియల్ హైట్స్, వినాయకనగర్, ప్రకాష్‌నగర్ ఏరియాలలో విద్యుత్ ఉండదని ఏఈ రాజేందర్ తెలిపారు.

గచ్చిబౌలిలో..

గచ్చిబౌలి: విద్యుత్ సంబంధిత మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు గచ్చిబౌలి ఏఈ వేణుగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నానక్‌రాంగూడ సబ్ స్టేషన్ పరిధిలోని జర్నలిస్ట్ కాలనీ, గురుకుల్ పాఠశాల, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు టీఎన్‌జీవోస్ కాలనీ ఫేజ్-1 తదితర ప్రాంతాలలో విద్యుత్ ఉండదన్నారు.

చందానగర్ ఫీడర్ పరిధిలో..

మియాపూర్ : చందానగర్ ఫీడర్, శాంతినగర్ విద్యుత్ ఫీడర్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని ఏఈ సురేందర్ ఓ ప్రకటనలో తెలిపారు. చందానగర్ ఫీడర్ పరిధిలో.. సోమవారం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు చందానగర్ మెయిన్‌రోడ్డు, ఇందిరానగర్ కాలనీ, చెన్నారెడ్డి ఆసుపత్రి, గీతా థియేటర్ ఏరియా, గ్యాస్ గోడౌన్, అదేవిధంగా శాంతినగర్ ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 2 గంటల నుండి సా.5 గంటల వరకు శాంతినగర్, రాజీవ్‌నగర్, కడిమి ఆసుపత్రి, హుడా ఫేజ్ ప్రాంతాలలో విద్యుత్ ఉండదని తెలిపారు.

పాజిటివ్ నిల్...

హఫీజ్‌పేట్ : హఫీజ్‌పేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆదివారం ఇద్దరికి కరోనా పరీక్షలు నిర్వహించగా జీరో పాజిటివ్ అని వైద్యులు అరవింద్ పేర్కొన్నారు.

క్లుప్తంగా...

నూతన కార్యవర్గం.. సన్మానం



నూతన కార్యవర్గాన్ని సన్మానిస్తున్న ఎమ్మెల్యే గాంధీ

హఫీజ్‌పేట్ : మాదాపూర్ డివిజన్ పరిధిలోని సుభాష్‌చంద్రబోస్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎమ్మెల్యే గాంధీ సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు శ్రీనివాస్ యాదవ్, సాంబశివరావు, అంకారావు, బృందరావు, భుజంగం తదితరులు పాల్గొన్నారు.

కాలనీలో మీట్ అండ్ గ్రీట్



నిహారిక ల్యాండ్‌మార్క్ వాసులతో మాట్లాడుతున్న రవికుమార్‌యాదవ్

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి హుడా ట్రేడ్ సెంటర్ కాలనీ నిహారిక ల్యాండ్ మార్క్‌లో బీజేపీ నాయకులు రవికుమార్‌యాదవ్ ఆదివారం పర్యటించారు. మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమంలో భాగంగా అపార్టుమెంట్ వాసులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకవచ్చారు. సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

మల్లికార్జునస్వామి జాతర



మల్లికార్జున స్వామిని దర్శించుకున్న కార్పొరేటర్లు, నాయకులు

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని ఆల్విన్ కాలనీలో జరుగుతున్న శ్రీ భ్రమరాంబ కేతకి,రేణుక ఎల్లమ్మ సమేత మల్లికార్జునస్వామివారి జాతర కన్నుల పండుగా సాగింది. ఈ ఉత్సవంలో కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, పుష్ప నాగేష్,మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్ కుమార్ భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో జాతర నిర్వాహకులు మల్లేశ్ యాదవ్, మాజీ కార్పొరేటర్ శంకర్ యాదవ్, శ్రీకాంత్ యాదవ్,రాజు గోపాల్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.





మియాపూర్ దీప్తిశ్రీనగర్‌లో విచ్చలవిడిగా రోడ్లపై వాహనాల పార్కింగ్

ఏ దారైనా మాదే..?

- జాతీయ రహదారిపైనే పార్కింగ్
- సర్వీస్ రోడ్లనూ వదలని వైనం



చందానగర్ మంజీరా రోడ్డులో..

మియాపూర్: రోడ్లన్నీ పార్కింగ్‌కు అడ్డాగా మారుతున్నాయి. రెస్టారెంట్లు, షాపింగ్ మాల్స్, ఇతర వాణిజ్య సముదాయాల ముందున్న ప్రధాన రహదారులు సగానికి పైగా పార్కింగ్‌తో నిండిపోతున్నాయి. ట్రాఫిక్ పోలీసులు వీటిని అరికట్టడానికి తీసుకుంటున్న చర్యలు నామమాత్రంగానే ఉంటున్నాయనే ఆరోపణలున్నాయి. వ్యాపార సముదాయాల్లో వాహనాలు పార్కు చేసేందుకు స్థలం లేకపోవడంతో ఈ సమస్య రోజురోజుకూ తీవ్రమవుతోంది.

- చందానగర్, మియాపూర్ జాతీయ రహదారికి ఇరువైపులా ఎటు చూసినా వాహనాలు పార్కింగ్ చేస్తున్నారు. ఈ ప్రాంతంలో షాపింగ్ మాల్స్, రెస్టారెంట్లు పలు రకాల వాణిజ్య, వ్యాపార సంస్థలు అనేకంగా ఉన్నాయి.
- వ్యాపారాలు నిర్వహిస్తున్న కాంప్లెక్స్ భవనాల్లో పట్టుమని 20 శాతం పార్కింగ్ సౌకర్యం కూడా అందుబాటులో లేదు.
- చందానగర్, గంగారం నుంచి బీహెచ్‌ఇఎల్ చౌరస్తా వరకు రోడ్డుకు ఇరువైపులా వాహనాలు రోడ్డుపైనే సగానికి ఉంటున్నాయి.
- సర్వీస్ రోడ్డులో చిన్నచిన్న వ్యాపారాలు, తోపుడు బండ్లపై వ్యాపారాలు కొనసాగించడంతో సర్వీస్ రోడ్డు కూడా పూర్తిగా వాహనాల పార్కింగ్‌తో నిండిపోతోంది.
- గంగారం హనుమాన్ ఆలయం నుంచి మియాపూర్‌లోని బొల్లారం క్రాస్ రోడ్డు వరకు సర్వీస్ రోడ్డు అందుబాటులో లేదు. దీంతో జాతీయ రహదారికి ఇరువైపులా వాహనాలు నిలుపుతున్నారు. దీంతో ఉదయం, సాయంత్రం, రాత్రి సమయాల్లో ట్రాఫిక్ కారణంగా వాహనాలు నిలిచిపోతున్నాయి.
- శేరిలింగంపల్లి బీహెచ్‌ఇఎల్ వద్ద ఫ్లైఓవర్ నిర్మాణ పనుల కోసం చందానగర్‌లోని గాంధీ విగ్రహం వరకు జాతీయ రహదారిని విస్తరించేందుకు రోడ్డును తవ్వారు. రహదారి ఇరుకుగా మారడంతో తరచు ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి.ఓవైపు తవ్వకాలు, మరోవైపు వాహనాల పార్కింగ్‌తో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చందానగర్ గాంధీ విగ్రహం నుండి బీహెచ్ఇఎల్ చౌరస్తాకు వెళ్లడానికి సుమారు 45 నిమిషాల నుండి గంట సమయం పడుతుందని వాహనదారులు వాపోతున్నారు.
- ప్రధాన రహదారుల్లోని సెల్లార్‌లలో వ్యాపారాలు నిర్వహించరాదని, గతంలో అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి నోటీసులు జారీ చేశారు. కానీ ఇప్పటివరకు వాటిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

నయనానందకరం.. కూచిపూడి నృత్యం



మాదాపూర్: శిల్పారామంలో నిర్వహిస్తున్న హస్తకళా ప్రదర్శనలో భాగంగా సత్యం డ్యాన్స్ అకాడమీ గురువు మెళ్ళచెరువు కామేశ్వరీ శిష్యబృందం కూచిపూడి నృత్యప్రదర్శన ఇచ్చారు. ఇందులో గణపతి గీతం, జయము జయము, భావయామి, నమరామాయణం, లలిత స్తుతి, జయ జయ, జతిస్వరం, కోలాటం, శ్రీరామచంద్ర కృపాలు, దశావతారాలు తదితర అంశాలను కళ్యాణి, శ్రావణి, విబా, ఇషిత, శ్రీయ, కీర్తన, సాయిసహస్ర, సౌమ్య ప్రదర్శించారు.

జోడో అభియాన్ యాత్రను విజయవంతం చేయాలి



గాంధీ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కోటింరెడ్డి వినయ్‌రెడ్డి

గచ్చిబౌలి: హాత్ సే హాత్ జోడో అభియాన్ యాత్రను విజయవంతం చేయాలని కాంగ్రెస్ నాయకులు నిర్ణయించారు. ఆదివారం గాంధీ భవన్‌లో కాంగ్రెస్ సీనియర్ నాయకులు కోదండ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు నర్సింహారెడ్డి, నాయకులు హాజరయ్యారు. ఈ నెల 26 నుంచి పీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి హాత్ సే హాత్ జోడో అభియాన్ యాత్రను విజయవంతం చేసేందుకు కలిసి కట్టుగా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శులు కోటింరెడ్డి వినయ్‌రెడ్డి, జైపాల్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో పలువురి చేరిక



గచ్చిబౌలి: శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని పలు ప్రాంతాల యువకులు బీజేపీలో చేరారు. కొండాపూర్‌లోని బీజేపీ కార్యాలయంలో బీజేవైఎం రాష్ట్ర కోశాధికారి మారబోయిన రఘునాథ్ యాదవ్ ఆధ్వర్యంలో ఆదివారం పార్టీలో చేరారు. దేశంలో నరేంద్ర మోడి చేస్తున్న అభివృద్ధి పనులకు ఆకర్శితులై యువత బీజేపీ వైపు మొగ్గు చూపుతుందన్నారు. పార్టీలో చేరిన వారిలో ప్రసాద్, ఖానమెట్ రాజు, మణికొండ సుబ్రహ్మణ్యం, శ్రీనివాస్ రెడ్డి, రమేష్, నరేష్, రవి యాదవ్ తదితరులున్నారు.

చర్చి అభివృద్ధికి రూ.15లక్షలు విరాళం



చర్చి ప్రతినిధులకు విరాళాన్ని అందిస్తున్న గూడెం మధుసూదన్ రెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): నియోజకవర్గంలోని అన్ని వర్గాల సంక్షేమానికి ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని టీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గూడెం మధుసూదన్‌రెడ్డి అన్నారు. తెల్లాపూర్‌లోని న్యూలైట్ చర్చి అభివృద్ధికి ఎమ్మెల్యే రూ.15 లక్షల విరాళాన్ని ఆదివారం చర్చి ప్రతినిధులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అందరి సహాయ సహకారంతో నియోజకవర్గాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తున్నారని తెలిపారు. అనంతరం తెల్లాపూర్లో జరుగుతున్న మల్లికార్జున స్వామి జాతరలో ఆయన పాల్గొన్నారు. వేరువేరుగా జరిగిన ఈ కార్యక్రమంలో తెల్లాపూర్ మున్సిపల్ చైర్ పర్సన్ మల్లెపల్లి లలితా సోమిరెడ్డి, మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, మాజీ రాష్ట్ర సర్పంచుల ఫోరం అధ్యక్షులు మల్లెపల్లి సోమిరెడ్డి, తెల్లాపూర్ మున్సిపల్ టీఆర్‌ఎస్ అధ్యక్షుడు దేవేంద్ర యాదవ్, నాయకులు సునీల్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతి ముగ్గుల పోటీలు



భెల్ ఎంఐజీ కాలనీ రామాలయంలో ముగ్గులు వేస్తున్న మహిళలు

శేరిలింగంపల్లి: ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్, ధరణి మహిళా సంఘాల సంయుక్తాధ్వర్యంలో శేరిలింగంపల్లి భెల్ ఎంఐజీ కాలనీ శ్రీ రామాలయంలో సంక్రాంతి ముగ్గుల పోటీలను ఆదివారం నిర్వహించారు. నిర్వాహకులు టి.రామస్వామియాదవ్ మాట్లాడుతూ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకలు పండుగలన్నారు. 38 కాలనీల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమానికి సెంట్రల్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ శాంతి శ్రీ, ,గోదావరి అంజిరెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో స్థానిక మహిళా సంఘం నాయకురాళ్లు రజని, ఉమాపతి, లక్ష్మీ, రమాదేవి, రత్నకుమారి, రేణుకాదేవి, సాయిసుధ, దివ్య,వాణి, సుధ తదితరులు పాల్గొన్నారు.

గోపాల్‌నగర్‌లో 5కె రన్ ప్రారంభం



5కె రన్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్ శ్రీనివాసరావు తదితరులు

కేపీహెచ్‌బీకాలనీ: కేపీహెచ్‌బీ డివిజన్ గోపాల్‌నగర్‌లో 5కె రన్‌ను ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావులు హాజరై 5కె రన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాతూ రోజూ ఒక గంట వ్యాయామం చేస్తే ఆరోగ్య సమస్యలు రావన్నారు. ఎక్కడికక్కడ ఓపెన్ జిమ్‌లు, క్రీడా మైదానాలు ఉన్నాయని ప్రజలు ఉపయోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, సీనియర్ నాయకులు సాయిబాబా చౌదరి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత మెగా మెడికల్ క్యాంపు



మెడికల్ క్యాంపులో కంటి అద్దాలను అందిస్తున్న ఎమ్మెల్యే గాంధీ

మాదాపూర్: మాదాపూర్‌లోని చంద్రనాయక్‌తండాలో మెడికవర్ హాస్పిటల్స్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత మెగా మెడికల్ క్యాంప్‌ను ఆదివారం ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగర్వాల్ సమాజ్ దుర్గం చెరువు శాఖ, అగర్వాల్ సేవాదళ్, బద్రి విశాల్ పన్నలాల్ పిట్టి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ ప్రాంతంలో ఉచిత సేవా కార్యక్రమాలు చేస్తున్నందుకు అభినందించారు. కార్యక్రమంలో హైదర్‌నగర్ కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన అసోసియేషన్ సభ్యులు

మియాపూర్: చందానగర్ డివిజన్ పరిధిలోని దీప్తిశ్రీ నగర్ కాలనీ, సీబీఆర్ ఎస్టేట్ నూతన వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీని ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. కాలనీ అభివృద్ధికి తనవంతు సహకారం ఉంటుందన్నారు. సీబీఆర్ ఎస్టేట్ నూతన అసోసియేషన్ సభ్యులు వెంకట్, వైస్ ప్రెసిడెంట్ నాగేశ్వర్ రావు, ప్రసాద్ , జనరల్ సెక్రటరీ వెంకటరాము, విశ్వాస్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి సర్కిల్ ఆల్విన్‌కాలనీ జయానగర్‌లో యాదవ, కురుమ సంఘాల సభ్యుల సమావేశం ఆదివారం జరిగింది. ఈ సమావేశంలో వివేకానందనగర్, కూకట్‌పల్లి, ఆల్విన్‌కాలనీ, హైదర్‌నగర్ డివిజన్‌లకు చెందిన యాదవులు కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీలో గౌరవ అధ్యక్షుడు దాసరి నర్సింగ్ యాదవ్‌ను ఎన్నుకోగా అధ్యక్షుడిగా ఎక్కల్‌దేవ్ శ్రీకాంత్ యాదవ్, ప్రధాన కార్యదర్శులు కాశీనాద్ యాదవ్, కుమార్ యాదవ్, కార్యదర్శులు నాగరాజు యాదవ్, శ్రీనివాస్ కురుమ, సలహాదారులు సత్యనారాయణ యాదవ్, పర్వతాలు యాదవ్, త్రినాథ్ యాదవ్, అంజన్ యాదవ్, వేణు యాదవ్, ఉపాధ్యక్షులు వేణు యాదవ్, నిరంజన్ యాదవ్, బాలు యాదవ్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యాదవ అభివృద్ధి కోసం శాయశక్తులా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో బీరప్ప యాదవ్, రాజు యాదవ్, శ్రీనివాస్ యాదవ్, మల్లి యాదవ్, శ్రీశైలం యాదవ్, కడియాల వేణు యాదవ్, సన్యాసిరావు యాదవ్, అంజన్ పాల్గొన్నారు.

భిన్న సంస్కృతుల ‘సంగమం’



- కైరోస్ వేదికగా 'అరౌండ్ ద వరల్డ్ ఒడిస్సీ' ప్రదర్శన
- ప్రారంభించిన మాజీ కలెక్టర్ ఎం.వి రెడ్డి

సాక్షి, సిటీబ్యూరో: 'అరౌండ్ ద వరల్డ్ ఒడిస్సీ' పేరిట విప్రో సర్కిల్‌లోని కైరోస్ ఇంటర్నేషనల్ స్కూల్ వేదికగా నిర్వహించిన ఉత్సవాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఆదివారం నిర్వహించిన ఈ వార్షికోత్సవాలను మేడ్చల్ జిల్లా మాజీ కలెక్టర్ ఎం.వి రెడ్డి, కైరోస్ చైర్మన్ ఎం.వెంకట్ రెడ్డిలు ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ ఎం.వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రపంచంలోని వివిధ దేశాల నాగరికతలు, సంస్కృతులు, ఆచార వ్యవహారాలు, జీవనశైలిపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు 'అరౌండ్ ద వరల్డ్ ఒడిస్సీ'ని ప్రదర్శించామని తెలిపారు. ఇందులో పాఠశాలలోని విద్యార్థులు అమెరికా, టర్కీ, చైనా, బ్రెజిల్, ఆఫ్రికా, స్పెయిన్, కొలంబియా, క్యూబాతో పాటు మొత్తం 20 దేశాలకు సంబంధించిన ఆచార–వ్యవహారాలు, ఆయా దేశాల జీవన స్థితిగతులపై అధ్యయనం చేసి వాటిపై ప్రదర్శించారన్నారు. కార్యక్రమంలో కైరోస్ ఎండీ ఎం.సుమంత్ రెడ్డి, ప్రిన్సిపాల్ కృష్ణశ్రీ, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి మహిళలు ముందుకు రావాలి



మియాపూర్: మియాపూర్‌లో రంగారెడ్డి జిల్లా మహిళా అధ్యక్షురాలు కృష్ణవేణి, మహిళా మోర్చ ఇంచార్జి శ్రీధర్, నియోజకవర్గ కన్వీనర్ పద్మ ఆధ్వర్యంలో శేరిలింగంపల్లి నియోజకవర్గ మహిళా మోర్చా సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నియోజకవర్గంలో బీజేపీని మరింత బలోపేతం చేయడానికి మహిళలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అన్ని డివిజన్‌లలో మహిళా మోర్చ కమిటీలు , శక్తి కేంద్ర ఇంచార్జీలను నియమించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చ నాయకులు నాగులుగౌడ్, మహబూబ్‌నగర్ మహిళా మోర్చా ఇంచార్జి వినయ, రంగారెడ్డి జిల్లా సెక్రటరీ వరలక్ష్మీ ధీరజ్, విజయ, కల్పన, అరుణ, శోభా, మహేశ్వరీ, రేణుక, శ్రీలత, శిరీషారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



రాయదుర్గం: పూర్వ విద్యార్థులంతా ఏకమై 'మీ నేస్తం ఫౌండేషన్' పేరిట ప్రతియేటా పేద విద్యార్థులకు సేవ చేయాలని నిర్ణయించారు.రాయదుర్గంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకున్న 1997–98 బ్యాచ్ పదో తరగతికి చెందిన వారు నార్సింగిలోని కేవీఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఒక్కచోట చేరారు. యోగక్షేమాలు తెలుసుకున్నారు. ప్రతి యేటా ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు.

ప్రభుత్వ బడి.. సమస్యల ఒడి

- అధ్వానంగా మరుగుదొడ్లు
- నిర్వహణ లేక దుర్గంధం
- ఒకటికి, రెంటికి బయటకే
- విద్యార్థులకు తప్పని ఇబ్బందులు
- ఇదీ.. భెల్ జెడ్పీహెచ్‌ఎస్ దుస్థితి



బీహెచ్‌ఇఎల్ జిల్లా పరిషత్ పాఠశాల

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఉమ్మడి జిల్లాలో ఓ వెలుగు వెలిగిన బీహెచ్‌ఈఎల్ జెడ్పీహెచ్ పాఠశాల నేడు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతోంది. సంబంధిత అధికారులు సమస్యలపై స్పందించకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులుపడుతున్నారు. 1975లో బీహెచ్‌ఈఎల్ సంస్థ కార్మికుల పిల్లల కోసం కార్పొరేట్ స్థాయిలో జిల్లా పరిషత్ పాఠశాల భవనాన్ని నిర్మించింది. ఇంత కాలం పాఠశాల బాగోగులను చూసిన భెల్ యాజమాన్యం ప్రసుత్తం బడి నిర్వహణను పట్టించుకోవడంలేదు. దీంతో పాఠశాలలో కనీస వసతులకు నోచులేక విద్యార్థులు నానా ఇక్కట్లు పడుతున్నారు. మూత్రశాలలు, మరుగుదొడ్లు సరిగా లేక విద్యార్థులు ఆరుబయటకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.

ఒకే గదిలో 60 మంది విద్యార్థులు

జిల్లా పరిషత్ పాఠశాలతో పాటు ప్రాథమిక పాఠశాల ఇదే భవనంలో కొనసాగుతోంది. జెడ్పీహెచ్ఎస్‌లో 685 మంది విద్యార్థులు ఉండగా, ప్రాథమిక పాఠశాలలో 239 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. పాఠశాల భవనంలోనే ప్రభుత్వ హాస్టల్ కూడా ఉండడంతో తరగతి గదులకు కొరత ఏర్పడింది. ఒక్కొక్క తరగతిలో 50 నుంచి 60 మంది విద్యార్థులను ఉంచి విద్యాబోధన చేస్తున్నారు. గదుల సమస్య పరిష్కారానికి హాస్టల్‌ను వేరే చోటుకు తరలించాలని అధికారులు, ప్రజా ప్రతినిధులను కోరినా పట్టించుకోవడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు.





దుర్వాసనతో ఇక్కట్లు..

విద్యార్థుల సౌకర్యార్థం పాఠశాల ఉపాధ్యాయుడు శంకర్ బాబు దాతల సాయంతో మరుగుదొడ్లను నిర్మించారు. వాటిని ఎప్పటికప్పుడు శుభ్రం చేయకపోవడంతో దుర్వాసన వెదజల్లి విద్యార్థులు వినియోగించలేని పరిస్థితి నెలకొంది. హాస్టల్ విద్యార్థులు బహిరంగ మలవిసర్జన చేస్తుండడంతో పాఠశాల పరిసరాలు దుర్గంధంతో నిండిపోతోంది. తరగతి గదిలో కూర్చొని పాఠాలు వినలేకపోతున్నామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరుగుదొడ్లు అపరిశుభ్రంగా ఉండడంతో బాలికలు వాటిని వినియోగించుకోలేకపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మరుగుదొడ్లకు మర్మతులు చేసి, సమస్యలను పరిష్కరించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.